సాక్షి మంచిర్యాల

గురువారం : 19 : జనవరి : 2023



ఆర్టీసీకి సంక్రాంతి రద్దీ..! 8లో▸

సంక్రాంతి నేపథ్యంలో తిరుగు ప్రయాణికులతో మంచిర్యాల బస్‌స్టేషన్‌లో రద్దీ నెలకొంది. పండుగకు హైదరాబాద్ నుంచి ఉద్యోగులు, విద్యార్థులు స్వగ్రామాలకు వచ్చారు. మూడు రోజుల అనంతరం తిరుగు ప్రయాణం కావడంతో బస్‌స్టేషన్ కళకళలాడుతోంది.



శ్రామికుడా మేలుకో.. బీమా చేసుకో

రెక్కల కష్టం చేసుకుని జీవించే అసంఘటిత, సంఘటిత రంగాల కార్మికులకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. 8లో▸

గరిష్టం/కనిష్టం 32.1 /17.3

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువ అనిపిస్తుంది. ఉష్ణోగ్రతలు రెండు మూడు డిగ్రీలు పెరుగుతాయి. చలిప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

పారిశుధ్య నిర్వహణను నిర్లక్ష్యం చేయొద్దు



కాలనీలో పర్యటిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్

నస్పూర్: పట్టణంలో పారిశుధ్య నిర్వహణను నిర్లక్ష్యం చేయొద్దని అడిషనల్ కలెక్టర్ రాహుల్ మున్సిపల్ సిబ్బందికి సూచించారు. పట్టణంలోని వినూత్న కాలనీలో బుధవారం పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదనపు కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ రమేశ్, ఏఈ మధు ఉన్నారు.

సీహెచ్‌పీని తనిఖీ చేసిన అధికారులు



పరిశీలిస్తున్న అధికారులు

రామకృష్ణాపూర్: సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా పరిధిలోని ఆర్కేపీ సీహెచ్‌పీని కార్పొరేట్ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. సీహెచ్‌పీలోని యంత్రాలు, బంకర్లు, కన్వేయర్ బెల్ట్, ఇంటర్నల్ రోడ్లను పరిశీలించారు. రికార్డులు, ఎస్‌వోపీలను పరిశీలించి సూచనలు చేశారు. రక్షణపై గతంలో కంటే అవగాహన మెరుగైందని, పరిసరాల పరిశుభ్రత కూడా బాగుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో ఓదెలు, కార్పొరేట్ డీజీఎం సోమయాజులు, ఎస్ఈ గాబ్రియేల్‌రాజ్, ఈఈ రాజు, సీహెచ్‌పీ డీజీఎం బాలాజీ భగవతి, డీవైఎస్ఈ చంద్రమౌళి పాల్గొన్నారు.

బుగ్గ రాజేశ్వర జాతర కోసం వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: మండలంలోని కన్నాల శివారులోని బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి జాతర సందర్భంగా తైబజార్ వసూలు, టెంకాయలు, పూజాసామగ్రి విక్రయాలు, ప్రసాదాల విక్రయం, వాహనాల పార్కింగ్ కోసం బుధవారం వేలం నిర్వహించారు. దేవాదాయ శాఖ అధికారి వేణుగోపాల్‌గుప్తా సమక్షంలో ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహించారు. టెంకాయలు, పూజా సామగ్రి విక్రయాలకు రూ.46,500, ప్రసాదాల విక్రయానికి రూ.1,03,500, తైబజార్ వసూలుకు రూ.1,24,000, వాహనాల పార్కింగ్‌కు రూ.1,21,500లకు హక్కులను దక్కించుకున్నారు. వేలం ద్వారా గతేడాది కంటే ఈసారి రూ.38,500 అధికంగా ఆదాయం వచ్చినట్లు వేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్రీదేవి, కన్నాల సర్పంచ్ స్వరూప, ఈవో బాపురెడ్డి, కమిటీ సభ్యులు సంతోష్, గోపి, రాజన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకారవేతనాలకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో భాగంగా దుకాణాలు, వాణిజ్య సంస్థలు, కర్మాగారాలు, మోటారు, రవాణా సంస్థలు, సహకార సంస్థలు, ధార్మిక ఇతర ట్రస్టులలో పని చేస్తున్న కార్మికుల పిల్లలకు ప్రతిభ ఆధారంగా అందించే ఉపకార వేతనాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి ఇన్‌చార్జ్ కమిషనర్ గంగాధర్ తెలిపారు. 2021-22 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన వారు ఫిబ్రవరి 15లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారం సంబంధిత, సహాయ కార్మిక కమిషనర్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని, పూర్తి చేసిన దరఖాస్తులను ఫిబ్రవరి 15లోగా సంబంధిత కార్మికశాఖ కార్యాలయంలో అందజేయాలని వివరించారు. పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులైన వారికి రూ.వెయ్యి, పాలిటెక్నిక్ పాస్ అయిన వారికి రూ.1,500, ఇంజినీరింగ్, మెడిసిన్, లా, బీఎస్సీ అగ్రికల్చర్, వెటర్నరీ, నర్సింగ్, హార్టికల్చర్, బీసీఏ, ఎంసీఏ, బిఫార్మసీ, ఎంఫార్మసి, బీబీఏ, ఎంబీఏ, డిప్లొమా ఇన్ మెడికల్ లేబొరేటరీ టెక్నీషియన్, పీజీ డిప్లొమా ఇన్ మెడికల్ లేబొరేటరీ టెక్నీషియన్ వారికి రూ.2 వేలు చెల్లించడం జరుగుతుందని వివరించారు. కోర్సులో మార్కుల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉపకార వేతనాలను సంబంధిత సహాయ కమిషనర్లు మే నాటికి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కంటికి వెలుగునిద్దాం

- నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా నేత్రవైద్య శిబిరాలు
- ఏకకాలంలో 40 కేంద్రాలు ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తిచేసిన జిల్లా యంత్రాంగం



జిల్లా కేంద్రంలోని కంటివెలుగు కేంద్రాలను పరిశీలిస్తున్న రాష్ట్ర నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: ప్రజల్లో కంటి సమస్యలు తొలగించేందుకు, నేత్ర సంబంధ సమస్యలతో బాధపడుతున్నవారికి చికిత్స చేసేందుకు, కళ్లద్దాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత కంటివెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఖమ్మంలో సీఎం కేసీఆర్ బుధవారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా శిబిరాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 గంటలకు జిల్లాలో ఏర్పాటు చేసిన 40 శిబిరాలను ఏకకాలంలో ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఇందుకు అవసరమైన సామగ్రి, కళ్లద్దాలు ఆయా క్యాంపు కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. జిల్లాలోని 310 గ్రామపంచాయతీలు, 7 మున్సిపాలిటీల్లోని 174 వార్డుల్లో దాదాపుగా 9,03,881 మందికి కంటి పరీక్షలు చేసేలా అధికారులు 40 టీంలను ఏర్పాటు చేశారు. ఒక్కో ప్రాంతంలో కనీసం రెండు రోజుల నుంచి వారంపాటు శిబిరాలు నిర్వహిస్తారు. ఆయా క్యాంపు పరిధిలోని ప్రజలకు ఆహ్వాన పత్రికలు పంచి, అందరూ శిబిరాలకు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రజాప్రతినిధులను ఇందులో భాగస్వాములను చేయనున్నారు.

వారంలో ఐదు రోజులు శిబిరాలు..

వారంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు ఐదు రోజులు నిత్యం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ క్యాంపులు కొనసాగుతాయి. పబ్లిక్ హాలీడేస్ సమయాల్లో సెలవు ఉంటుంది. అవసరమైన వారికి వైద్య పరీక్షలను చేసి, కంటి సంబంధిత లోపాలను గుర్తించి, దృష్టిలోపం ఉన్న వారికి అక్కడే కళ్లద్దాలు పంపిణీ చేస్తారు. దగ్గర చూపు ఇబ్బంది ఉన్నవారికి రీడింగ్ గ్లాసులను అక్కడే ఇవ్వనుండగా, ప్రత్యేకమైన అద్దాలు అవసరం ఉన్న వారికి బార్‌కోడ్ ద్వారా డాటాఎంట్రీ ఆపరేటర్ అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. 15 రోజుల్లోగా ఆయా క్యాంపుల పరిధిలోని పీహెచ్‌సీలకు పంపిస్తారు. వాటిని ఏఎన్‌ఎంలు సంబంధిత వ్యక్తులకు అందిస్తారు.

18 ఏళ్లు దాటిన అందరికీ పరీక్షలు..

18 ఏళ్లు నిండిన ప్రజలందరూ ఈ క్యాంపుల్లో కంటి పరీక్షలు ఉచితంగా చేసుకోవచ్చు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ నంబర్ తప్పనిసరిగా తీసుకురావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా వైద్యాధికారి, ప్రోగ్రాం అధికారి, మేనేజర్‌లు అక్కడి నుంచే శిబిరాల నిర్వహణ తీరును పర్యవేక్షిస్తారు. జిల్లాలో 40 చోట్ల ఏర్పాటు చేసిన క్యాంపులను డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు, కంటి వెలుగు రాష్ట్ర నోడల్ అధికారి శ్రీనివాస్, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఫయాజ్‌ఖాన్, ప్రోగ్రాం ఆఫీసర్ ప్రశాంతి, డెమో వెంకటేశ్వర్ పరిశీలించారు. మంచిర్యాల మున్సిపాలిటీలోని కంటి వెలుగు కేంద్రాలు, మౌలిక వసతులను మున్సిపల్ కమిషనర్ ఎస్. బాలకృష్ణ పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఉదయం 9 గంటలకు కలెక్టర్ భారతి హోళ్లికేరి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు శిబిరాన్ని ప్రారంభిస్తారు.

నేడు ప్రారంభించే క్యాంపులు

బెల్లంపల్లి మండలం గురిజాల, ఆకెనపల్లిలో, భీమినిలో, భీమారం, చెన్నూరు మండలం అంగ్రాజ్‌పల్లి, కాచన్‌పల్లిలో, దండేపల్లి మండలం చిల్కగూడ, తాళ్లపేట్‌లో, హాజీపూర్ మండలం దొనబండ, గఢ్‌పూర్, జైపూర్ మండలం కేంద్రం, బెజ్జాల్, జన్నారం మండలంలోని జన్నారం, పొనకల్, ఇందన్‌పల్లిలో, కన్నెపల్లిలో, కాసిపేట్ మండలం బుగ్గగూడ, గట్రావ్‌పల్లిలో, కోటపల్లి మండలం సర్వాయిపేట, వెంచపల్లిలో, లక్షెట్టిపేట మండలం అంకతపల్లిలో, మందమర్రి మండలం అదిల్‌పేట్‌లో, నెన్నెల మండలం ఆవడంలో, తాండూరు మండలం కాసిపేట, గోపాల్‌నగర్‌లో, వేమనపల్లిలో క్యాంపులను ఏర్పాటు చేయనున్నారు.

మున్సిపాలిటీల్లో..

జిల్లాలోని చెన్నూరు మున్సిపాలిటీలో వార్డు నంబర్ 1 బ్రాహ్మణవాడ, మంచిర్యాల మున్సిపాలిటీలోని 1వ వార్డు రాజీవ్‌నగర్ యూపీహెచ్‌సీ, 15వ వార్డు హమాలీవాడ బస్తీ దవాఖాన, 20వ వార్డులోని వృద్ధుల డేకేర్ సెంటర్, 23వ వార్డు బైపాస్‌రోడ్డులోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో, లక్షెట్టిపేట మున్సి పాలిటీ పరిధి ఇటిక్యాలలోని ఎగ్గడి గట్టయ్య బిల్డింగ్, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలోని 1వ వార్డు డివినిటి స్కూల్‌లో, మందమర్రి మున్సిపాలిటీలో 1వ వార్డు పద్మశాలి భవన్‌లో, బెల్లంపల్లి మున్సిపాలిటీలో 1వ వార్డు కన్నాలబస్తీ జెడ్పీ స్కూల్‌లో, 18వ వార్డు కాంట్రాక్టర్ బస్తీ శిశు మందిర్ హైస్కూల్‌లో, నస్పూరు మున్సి పాలిటీలో 9వ వార్డు సింగరేణి క్వార్టర్ శ్రీరాంపూర్ కాలనీలో, 1వ వార్డు నాగార్జున కాలనీ మనోరంజన్ సముదాయ్, 16వ వార్డు శ్రీరాంపూర్ కాలనీ సీఈఆర్ క్లబ్‌లో క్యాంపులు ఏర్పాటు చేస్తారు.

'సేవ'లో చేతివాటం!

ఇటీవల ఆసిఫాబాద్ నుంచి ఓ వ్యక్తి పాస్ పోర్టు రెన్యువల్ కోసం మంచిర్యాల పోస్టాఫీసు పాస్‌పోర్టు సేవా కేంద్రానికి వచ్చాడు. అయితే దరఖాస్తుదారు పేరులోని అక్షరాల్లో కొద్దిగా తేడా ఉండడంతో అక్కడి అధికారులు మళ్లీ రమ్మని చెప్పారు. తాను మళ్లీ రావాలంటే ఇబ్బంది అవుతుందని చెప్పాడు. దీంతో రూ.2 వేలు ఇస్తే పనిచేస్తామని సలహా ఇచ్చారు. అంత దూరం నుంచి మరో రోజు రావడం, పోవడం ఇబ్బందని భావించి రూ.వెయ్యి ఇచ్చి పని చేయించుకున్నాడు.

- మంచిర్యాల పోస్టల్ పాస్‌పోర్టు కేంద్రంలో వసూళ్లు
- లోపాలుంటే దరఖాస్తుదారులకు అదనపు బాదుడు



పోస్టాఫీసు పాస్ పోర్టు సేవా కేంద్రం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: విద్య, ఉద్యోగం, ఉపాధి, పర్యాటకం కోసం విమానాల్లో విదేశాలకు వెళ్లాలంటే పాస్‌పోర్టు తప్పనిసరి. దీనికోసం ఒకప్పుడు జిల్లావాసులు హైదరాబాద్‌కు వెళ్లేవారు. తర్వాత కరీంనగర్, వరంగల్‌లో సబ్ పాస్‌పోర్టు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో కాస్త దూరభారం తగ్గింది. అయితే విదేశాలకు వెళ్లేవారి సంఖ్య ఏటా పెరుగుతుండడంతో పాస్‌పోర్టు సేవలు అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్ర విదేశాంగ శాఖ, పోస్టల్ శాఖ సంయుక్తంగా 'పోస్టాఫీసు పాస్‌పోర్టు సేవా కేంద్రాలు' (పీవోపీఎస్‌కే) నెలకొల్పాయి. 2019, ఫిబ్రవరిలో మంచిర్యాల రైల్వేస్టేషన్ పక్కన ఉన్న పాత హెడ్ పోస్టాఫీసు భవనంలో ఈ కేంద్రం ఏర్పాటు చేశారు. అప్పటి వరకు ఈ ప్రాంత వాసులు పాస్‌పోర్టు కోసం కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌కు వెళ్లి దరఖాస్తులు, పునరుద్ధరణ, మార్పులు చేర్పులు, తదితర సేవల కోసం పడే ఇబ్బందులు తప్పాయి. నాలుగేళ్లుగా జిల్లాతోపాటు ఆసిఫాబాద్, మహారాష్ట్ర, పెద్దపల్లి, జగిత్యాల, తదితర ప్రాంతాల నుంచి దరఖాస్తుదారులు మంచిర్యాలకు వస్తున్నారు. ఇక్కడ రద్దీ తక్కువగా ఉంటుందని హైదరాబాద్, వరంగల్‌లో ఉంటున్నవారు సైతం మంచిర్యాలకే వస్తున్నారు. దీంతో తాకిడి పెరుగుతోంది. అయితే ఇక్కడ రోజుకు 40 మందికి మాత్రమే సేవలు అందుతున్నాయి. ఆన్‌లైన్‌లో రూ.1,500 చెల్లించి, నిర్ణీత తేదీ, సమయం ప్రకారం వస్తే, ధ్రువపత్రాల పరిశీలన, బయోమెట్రిక్‌తో వేలి ముద్రలు, ఫొటోలు తీసుకుని ప్రక్రియ పూర్తి చేస్తారు. స్థానికంగా పోలీసు అధికారుల పరిశీలన తర్వాత పీసీసీ (పోలీసు క్లియరెన్సు సర్టిఫికెట్) పొందాల్సి ఉంటుంది. అనంతరం పాస్‌పోర్టును పోస్టు ద్వారా దరఖాస్తుదారులు ఇచ్చిన చిరునామాకు చేరుతుంది.

పైసలిస్తే తప్పు ఒప్పవుతుంది..

పాస్‌పోస్టు సేవా కేంద్రంలో ఒక అధికారి పోస్టల్ శాఖ నుంచి మరో పాస్‌పోర్టు సేవా అధికారి ఉన్నారు. ఈ ఇద్దరే దరఖాస్తు దారులకు సేవలందిస్తున్నారు. అయితే అన్ని వివరాలు సరిగా ఉండి, సరైన సమయంలో హాజరైతే ఏ ఇబ్బంది లేదు. ఏమైనా సమస్య ఉంటే మాత్రం అక్కడ ఎంతో కొంత ముట్టజెప్పాల్సిందే. చాలామంది రెండు మూడు సార్లు కేంద్రానికి రావాల్సి వస్తోంది. జాప్యం లేకుండా వెంటనే పాస్‌పోర్టు పొందాలనే ఆరాటంతోనూ డబ్బులు ఇచ్చేందుకు వెనకాడడం లేదు. వాస్తవానికి ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించాక ఈ ఆఫీసులో ఒక్క పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు. కేవలం అవసరమైన ధ్రువపత్రాలు మాత్రమే చూపించాలి. ఏదో ఒక తప్పు ఉంటే, అక్కడి అధికారులకు కలిసివస్తోంది. దీంతో గుట్టుచప్పుడు కాకుండా వసూలు చేస్తున్నారని దరఖాస్తుదారులు వాపోతున్నారు. అన్ని డాక్యుమెంట్లు ఉన్నవారి వద్ద డబ్బులు అడగడం లేదని చెబుతున్నారు.

ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు



పాస్‌పోర్టు సేవాకేంద్రంలో ఎవరి నుంచి డబ్బులు తీసుకోవడం లేదు. ఇక్కడి అధికారులు ఎవరినీ అడగరు. తప్పిదాలు ఉంటే సరిచేసుకుని రావాలని చెబుతున్నాం. అంతా ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు ఉంటాయి. ఎవరైనా అడిగితే ఆధారాలతో ఫిర్యాదు చేయొచ్చు.

– సందీప్, జూనియర్ పాస్‌పోర్టు అధికారి, పీవోపీఎస్‌కే, మంచిర్యాల

రెండు జిల్లాలకు 'భారత్‌మాల'

- మరో గ్రీన్‌ఫీల్డ్ హైవేకు కేంద్రం అనుమతి
- తాండూర్ నుంచి కాగజ్‌నగర్ మీదుగా గడ్చిరోలి వరకు..
- 63.2 కిలోమీటర్ల మేర నిర్మాణం
- కుమురంభీం, మంచిర్యాల జిల్లాల్లో వెయ్యి ఎకరాలకు పైగా సేకరణ
- భూసేకరణ అధికారిగా కాగజ్‌నగర్ ఆర్డీవో నియామకం
- వచ్చే వారం సర్వే పనులు ప్రారంభం



సాక్షి, ఆసిఫాబాద్: జాతీయ రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న కేంద్రం కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవేకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. భారత్‌మాల పథకంలో భాగంగా మరో నాలుగు లేన్ల రహదారికి అంకురార్పణ జరగనుంది. మంచిర్యాల జిల్లా తాండూర్ నుంచి ప్రారంభం కానున్న ఈ జాతీయ రహదారి పనులు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా వరకు సాగనున్నాయి. తెలంగాణతోపాటు మహారాష్ట్రలోని అడవుల పరిధిలోని టైగర్ జోన్లలో ఈ రహదారి పనులు చేపట్టనున్నారు. ఎక్కడా ఒంపులు లేకుండా నేరుగా ఉండబోతున్న ఈ జాతీయ రహదారిని మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లో 63.2 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. ఇందుకోసం సుమారు వెయ్యి ఎకరాలకుపైగా భూమి సేకరించేందుకు అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది.

ఎనిమిది మండలాల మీదుగా..

రెండు జిల్లాల పరిధిలో బెల్లంపల్లి, తాండూర్, భీమిని, రెబ్బెన, దహెగాం, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కౌటాల మండలాల మీదుగా ఈ జాతీయ రహదారి వెళ్లనుంది. మొత్తం 63.2 కిలోమీటర్ల మేర రహదారి పనులు చేపట్టనున్నారు. కాగజ్‌నగర్ పరిధిలోని కడంబా, కవ్వాల్ టైగర్‌జోన్లతోపాటు గడ్చిరోలి ఆటవీ ప్రాంతంలోని టైగర్ జోన్ల మీదుగా ఈ రహదారి నిర్మాణం జరగనుంది. అభయారణ్యంలోని పులులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈ జోన్ల పరిధిలో ఎలివేటెడ్ ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.

వెయ్యి ఎకరాలకు పైగా భూసేకరణ..

కుమురంభీం, మంచిర్యాల జిల్లాల పరిధిలో ఇప్పటికే మంచిర్యాల నుంచి వాంకిడి మండలంలోని సరిహద్దు గ్రామం గోయగాం వరకు జాతీయ రహదారి-363 పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. తాజాగా కేంద్ర నిర్ణయంతో మరో జాతీయ రహదారి అందుబాటులోకి రానుంది. మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం అన్నారం, గంపలపల్లె, అచ్చలాపూర్, చంద్రపల్లె, రాంపూర్, కత్తెర్ల, ద్వారకపూర్, కాసిపేట, బోయపల్లె, మదనాపూర్, బెల్లంపల్లి మండలంలోని చాకెపల్లె, అంకుసం, భీమిని మండలంలో ని కేస్లాపూర్, కొత్తగూడ, వాదల్, లక్ష్మీపూర్, భీమిని, కమలాపూర్, పోతేపల్లి, కుమురంభీం జిల్లా రెబ్బెన మండలంలో జక్కంపల్లి, దహెగాం మండలంలోని రాళ్లగూడ, జెండాగూడ, ఐట్యాల, బోర్లగుంట, కాగజ్‌నగర్ మండలంలోని అనుకోడ, మందువ, గన్నారం, మోసం, నాగంపేట, రాస్పల్లి, జంబుగ, సిర్పూర్(టి) మండలంలోని లోనవెల్లి, పారిగాం, టోంకిని, లక్ష్మీపూర్, వెంట్రావుపేట, రుద్రారం, హీరాపూర్, చింతకుంట, అరెపల్లి, చుంచుపల్లి, కౌటాల మండలంలోని సాండేగాం, కోఠి, కౌటాల, పార్డి, కుంబారి, వీరవెల్లి గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాలకుపైగా భూములు సేకరించనున్నారు.

భూసేకరణకు సన్నాహాలు..

గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనుల కోసం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల పరిధిలోని ఎనిమిది మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాలకుపైగా భూమి సేకరించాల్సి ఉంటుందని అధికారుల అంచనా. ఈ జాతీయ రహదారి పనుల సర్వేకు ఇప్పటికే కేంద్రం అనుమతి ఇవ్వడంతో వచ్చే వారం సర్వే ప్రక్రియ ప్రారంభం కానుంది. సర్వే పనులు పూర్తయ్యాక బీపీఆర్(బిజినెస్ ప్రాసెస్ రీఇంజనీరింగ్) తయారైన వెంటనే జిల్లా అధికారులు భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఇప్పటికే కాగజ్‌నగర్ ఆర్డీవో రాజేశ్వర్‌ను భూసేకరణ అధికారిగా కలెక్టర్ రాహుల్‌రాజ్ నియమించారు. ఆయన ఆదేశాలతో ఎనిమిది మండలాల తహసీల్దార్లు భూములు కోల్పోతున్న రైతులతో సంప్రదింపులు జరిపేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం.

ఎంసీహెచ్‌లో ఓపీ సేవలు షురూ



ఓపీ కోసం వచ్చి క్యూలో ఉన్న గర్భిణులు



వాహనంలో ఎంసీహెచ్‌కు వచ్చిన గర్భిణులు



వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది..

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఆర్నెళ్ల తర్వాత ఎట్టకేలకూ పునఃప్రారంభమైంది. గతేడాది కురిసిన భారీ వర్షాలకు భవనం నీట మునగడంతో జూలై 12 నుంచి వైద్య సేవలు నిలిపివేశారు. బుధవారం ఓపీ సేవలు ప్రారంభించారు. మొత్తంగా 93 మంది గర్భిణులకు స్కానింగ్‌తో పాటు, ఇతరత్రా పరీక్షలు నిర్వహించారు. పూర్తిస్థాయిలో భవనం వినియోగంలోకి రాకపోవడంతో ప్రస్తుతం ఓపీ సేవలకే పరిమితం చేశారు. భవనం పూర్తిగా అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రసవాలు సైతం చేపడతామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చందర్ తెలిపారు.

లాభదాయక పంటలు సాగు చేయాలి

- జిల్లా వ్యవసాయ అధికారి జి.కల్పన



పురుగు మందులను పరిశీలిస్తున్న డీఏవో కల్పన

జైపూర్: రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని, లాభదాయక పంటలు సాగు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి జి.కల్పన సూచించారు. జైపూర్ మండలం కాన్కూర్ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న వరి, మామిడి, కూరగాయల క్షేత్రాలను బుధవారం పరిశీలించారు. సాగులో అవలంబించాల్సిన మెలకువలను వివరించారు. స్థానిక ఏఈవోల సూచనలు, సలహాల మేరకు పంటల సాగులో సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా లాభాలు పొందవచ్చన్నారు. రైతులు సేంద్రియ వ్యవసాయాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు పొందవచ్చని పేర్కొన్నారు. అనంతరం పంటల నమోదు ప్రక్రియను పరిశీలించి రైతులు సాగుచేస్తున్న పంటలను వాటిలో నమోదు చేయాలని ఏఈవోకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని డీసీఎంఎస్, రైతు సేవాకేంద్రం, ముదిగుంట గ్రామంలోని రైతుసేవా కేంద్రాన్ని కల్పన తనిఖీ చేశారు. గోదాముల్లోని ఎరువులు, పురుగు మందుల కాల పరిమితిని పరిశీలించారు. డీలర్లు తప్పనిసరిగా పీవోఎస్ మెషీన్ ద్వారానే ఎరువుల అమ్మకాలు జరపాలని తెలిపారు. రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు. రైతులు కూడా ఎరువుల దుకాణానికి వచ్చేటప్పుడు ఆధార్‌కార్డు తమ వెంట తీసుకువచ్చి పురుగుల మందులు, ఎరువులు తీసుకెళ్లాలని తెలిపారు. డీఏవో వెంట మండల వ్యవసాయశాఖ అధికారి మార్క్ గ్లాస్టన్, ఏఈవో కొమురయ్య, కాన్కూర్ సర్పంచ్ కె.వెంకటేశ్వర్‌గౌడ్, కాన్కూర్ రైతుబంధు సమితి కోఆర్డినేటర్ గుర్ల భీంరావు ఉన్నారు.

బృహత్ ప్రకృతివనం పూర్తి చేయాలి



స్థలాన్ని పరిశీలిస్తున్న మధుసూదన్‌నాయక్, రాహుల్

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లిలో బృహత్ పల్లెప్రకృతివనం పనులు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్లు మధుసూదన్‌నాయక్, రాహుల్ అన్నారు. మండల రెవెన్యూ, మండల పరిషత్ అధికారులతో కలిసి కాసిపేట గని సమీపంలోని నాలుగు ఎకరాల సింగరేణి స్థలాన్ని బుధవారం పరిశీలించారు. త్వరగా స్థలాలను కేటాయించుకుని పనులు పూర్తి చేయాలని, మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. బృహత్ పల్లెప్రకృతివనం, నర్సరీ, పల్లెప్రకృతి వనాలపై నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. వారివెంట తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎంపీడీవో ఎంఏ.ఆలీం, ఎంపీవో నాగరాజు, ఉపసర్పంచులు తిరుపతి, సుమన్ ఉన్నారు.

ఉచిత శిక్షణ

మంచిర్యాలఅగ్రికల్చర్: రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్-2, 3, 4, సర్వీసెస్ కోసం ఫౌండేషన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. క్వాలిఫైయింగ్ పరీక్ష, డిగ్రీలో మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తూ జిల్లాలో 100 మంది షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థులకు నాన్ రెసిడెన్షియల్‌గా 3 నెలలు స్పెషల్ ఫౌండేషన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఆన్‌లైన్ ద్వారా www.tsstudycircle.co.in వెబ్‌సైట్‌లో ఈనెల 31లోగా అర్హత గల జనరల్/ప్రొఫెషనల్ డిగ్రీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని వివరించారు. గతంలో ఫౌండేషన్ కోర్సు 5 నెలల ప్రోగ్రామ్‌ను 11 టీఎస్ఎస్సీ స్టడీ సర్కిల్, స్టేట్ స్టడీ సర్కిల్ వద్ద సీఎస్ఎస్టీ బీసీ, ఎస్టీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ వినియోగించుకున్న అభ్యర్థులు ఉచిత శిక్షణకు అర్హులు కారని తెలిపారు. వివరాల కోసం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు కార్యాలయంలో, వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

మన ఊరు - మన బడి పనుల్లో వేగం పెంచాలి



పనులు పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారి

నెన్నెల(భీమిని): భీమిని, కన్నెపల్లి మండలాల్లోని మోడల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేపడుతున్న మన ఊరు మన బడి పనుల్లో వేగం పెంచాలని జిల్లా సెక్టోరియల్ అధికారి సబ్దర్‌అలీఖాన్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. భీమిని, కన్నెపల్లి మండలాల్లోని కేస్లాపూర్, చెన్నాపూర్, మామిడిపల్లి, చింతపుడి, జజ్జరవెల్లి ప్రభుత్వ పాఠశాలలోని పనులు బుధవారం పరిశీలించారు. ఈనెల 26న ప్రారంభోత్సవం ఉంటుందని తెలిపా రు. ఆయన వెంట ఎంఐఎస్ శ్రీధర్, సీఆర్పీలు వెంకటేశ్వర్, నారాయణ, స్వామి, హెచ్‌ఎంలు ఉన్నారు.

క్లుప్తంగా

‘ఆరె కులస్తులను ఓబీసీ జాబితాలో చేర్చాలి’



మాట్లాడుతున్న చెట్టుపల్లి శివాజీ

చెన్నూర్: అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్న ఆరె కులస్తులను ఓబీసీ జాబితాలో చేర్చాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పద్మశాలి సంఘ భవనంలో ఏర్పాటు చేసిన ఆరె కుల సంఘ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఛత్రపతి శివాజీ వారసులంతా ఆరె కులస్తులేనన్నారు. కొన్ని జిల్లాల్లో ఆరె, మరికొన్ని జిల్లాల్లో ఆరె క్షత్రియ, ఆరె మరాఠా అని చెప్పుకుంటూ కులంలోనే విభజన రేఖాలు గీసుకోవడం సరికాదన్నారు. వ్యవసాయమే ప్రధాన వృత్తిగా జీవనం సాగిస్తున్న ఆరె కులస్తులు అన్ని రంగాల్లో అట్టడుగున ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చాప్లె రావూజీ, ఉపాధ్యక్షుడు కుబిడే మధుకర్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి అభ్యర్థులకు ఉచిత శిక్షణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నిరుపేద పద్మశాలి అభ్యర్థులకు గ్రూప్–1 మెయిన్స్ ఉచిత శిక్షణ, భోజన, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహ అధ్యక్షుడు ఎనగండ్ల రాహుల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్–1 సర్వీసెస్ ప్రిలిమినరీ ఫలితాల్లో ఉత్తీర్ణులైన పద్మశాలి అభ్యర్థులకు ముందుగా ఆయన శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రూప్స్‌లో రాణించిన నిరుపేద అభ్యర్థులకు దాతల సహకారంతో ఉచిత శిక్షణ, భోజన, వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాలకు 8555002354 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగ అవకాశం

మంచిర్యాలటౌన్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్, రాష్ట్ర ఆర్థిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ జపాన్ ప్రభుత్వ పథకం కింద జపాన్‌లో పనిచేసేందుకు అర్హత కలిగిన నర్సింగ్ సిబ్బందికి శిక్షణ, నియామకం చేపడుతున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి వెంకటరమణ ఒక ప్రకటనలో బుధవారం పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీన జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో స్క్రీనింగ్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత కళాశాలలు, సంస్థల నుంచి బీఎస్సీ నర్సింగ్ గ్రాడ్యుయేట్లు, జీఎన్‌ఎం డిప్లొమా హోల్డర్లు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ముందస్తు పని అనుభవం అవసరం లేదని, 22 నుంచి 35 ఏళ్ల వయస్సు గలవారు అర్హులని, ఆసక్తి గల వారు జగిత్యాల ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో 21న ఉదయం 10 గంటల్లోపు రిపోర్టు చేయాలని తెలిపారు. ఎంపిక చేయబడిన అభ్యర్థులకు జపనీస్ భాషపై రెసిడెన్షియల్ శిక్షణ, జపాన్‌లో పని చేసేందుకు అవసరమైన అదనపు వృత్తిపరమైన నైపుణ్యాలు అందించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు నెలకు రూ. 1.20 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు సంపాదించుకోవచ్చని, పరిమిత సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. దరఖాస్తు చేసుకునేందుకు టోమ్‌కామ్ హెచ్‌ఆర్ మేనేజర్లను ఈ నంబర్లలో 9951909863/ 9100798204 లేదా hrm.tomocom-letf@ telangana. gov. in కు ఈమెయిల్ చేయాలని, ఇతర వివరాలకు www. tomcom. telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

శ్రామికుడా మేలుకో.. బీమా చేసుకో

- సాధారణ నమోదుపై నిర్లక్ష్యం
- జిల్లాలో లక్షల్లో కార్మికులు, వేలల్లో నమోదు
- ఈ–శ్రమ్ నమోదుకు స్పందన
- కార్మిక శాఖ దృష్టిసారిస్తేనే సత్ఫలితం



జిల్లా కేంద్రంలోని ఇటుక బట్టీలో పని చేస్తున్న కార్మికులు

మంచిర్యాలక్రైం: రెక్కల కష్టం చేసుకుని జీవించే అసంఘటిత, సంఘటిత రంగాల కార్మికులకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ–శ్రమ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు సుమారు 2 లక్షలకు పైగా ఉండగా ఇందులో సాధారణ రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు వేలసంఖ్యలో ఉన్నారు. ఇందులో లబ్ధిపొందినవారు వందల్లోనే ఉండడం గమనార్హం. జిల్లాలో ఈ–శ్రమ్ కార్డు పొందినవారు 1,03,916 మంది ఉండగా సాధారణ లేబర్‌కార్డు పొందినవారు 48,565 మంది ఉన్నారు. వీరిలో వివాహం, విద్య, బాలింత ఖర్చులు, తదితర లబ్ధిపొందినవారు 3,443 మంది ఉన్నారు.

పథకానికి ఎవరు అర్హులు..

సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన సుమారు 54 రకాల పనుల్లో పాల్గొనే కార్మికులంతా కార్మికశాఖ ద్వారా సాయం పొందేందుకు అర్హులు. ఇటుక బట్టీలు, బ్రెడ్ కంపనీ, సిరామిక్స్, హోటళ్లు, గ్యారేజీలు, బిల్డింగ్ వర్కర్లు, ఇండస్ట్రీస్, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేసే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు, ఆస్పత్రులు, తదితర రంగాల్లో పనిచేసే రోజువారి కూలీలు సాధారణ రిజిస్ట్రేషన్‌కు అర్హులు.

సాధారణ రిజిస్ట్రేషన్ ఇలా..

సంఘటిత, అసంఘటిత రంగాల్లో వివిధ రకాల పనిచేసే కార్మికులు, కూలీలు రూ.110 చలానాతో మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా నంబర్, రెండు పాస్ ఫొటోలతో దరఖాస్తును కార్మిక శాఖ కార్యాలయంలో అందజేయాలి. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి నిర్ధారించిన తర్వాత గుర్తింపు కార్డులను జారీ చేస్తారు. దీంతోపాటు ఐదేళ్లపాటు బీమా వర్తిస్తుంది. 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు లోపువారు పథకానికి అర్హులు. ఏడాది తర్వాత ఆర్థిక సాయానికి అర్హత లభిస్తుంది. రెన్యూవల్ చేసేందుకు రూ.60 చెల్లిస్తే సరిపోతుంది.

ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు ఇలా...

అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక సంక్షేమ పథకాలు వర్తింప జేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2021 ఆగస్టు 26న ఈ–శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించింది. జిల్లాకు 5 లక్షల చొప్పున లక్ష్యం విధించింది. మంచిర్యాల జిల్లాలో ఇప్పటి వరకు లక్షా 3వేల 916 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ పోర్టల్‌లో కార్మికులు మీ సేవ కేంద్రాల్లో నమోదు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ విధానంపై అవగాహన ఉంటే సొంతంగానే తమ మొబైల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏడాదిపాటు ఎలాంటి ప్రీమియం డబ్బులు తీసుకోకుండానే ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.లక్ష ప్రమాదబీమా వర్తిస్తుంది. శాశ్వత అంగవైకల్యం, మృతిచెందినా రూ .2లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.లక్ష బీమా పరిహారం నామినీకి అందజేస్తారు. ఆదాయపు పన్ను చెల్లించనివారు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయంలేనివారు, చిన్న సన్నకారు రైతులు, వ్య వసాయ అనుబంధ రంగాల కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, చిరు వ్యాపారులు, మత్స్యకార, మంగళి, చేనేత, రజక, డ్రైవర్, ఎలక్ట్రీషియన్, కల్లుగీత, వడ్రంగి, తదితరులు 16 నుంచి 59 ఏళ్ల వయస్సు వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

కార్మికశాఖలో సాధారణ రిజిస్ట్రేషన్ చేసుకున్న కార్మికులు

పురుషులు	27,293
స్త్రీలు	21,264
వివాహం కోసం లబ్ధి పొందినవారు	1,235 మంది
ప్రసూతికోసం లబ్ధి పొందినవారు	1,758 మంది
సాధారణ మరణం	381 మంది
ప్రమాదవశాత్తు మృతి చెందినవారు	69 మంది
ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వారు	1,03,916

కార్మికశాఖ అందిస్తున్న సంక్షేమ పథకాలు

- కార్మికుని భార్య రెండు కాన్పులకు రూ.30 వేల చొప్పున ఆర్థికసాయం
- కుమార్తె వివాహానికి రూ.30 వేల నగదు
- నైపుణ్యం పెంపొందించే శిక్షణకు 90 రోజుల పాటు రోజుకు రూ.300లు చెల్లిస్తారు.
- కార్మికుడు అంగవైకల్యం పొందితే రూ.4 వేల నుంచి రూ.లక్ష వరకు ఆర్థికసాయం.
- సాధారణ మరణానికి రూ.లక్ష, అంత్యక్రియల నిమిత్తం రూ.30 వేలు అందజేస్తారు.
- ప్రమాదవశాత్తు మృతి చెందితే అంత్యక్రియల ఖర్చులతో పాటు రూ.6లక్షల 30 వేలు అందిస్తారు.

అవగాహన కల్పిస్తున్నాం

భవన నిర్మాణ, ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికులకు కార్మికశాఖ ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నాం. బాల కార్మికులతో పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. కార్మిక శాఖ నుంచి లబ్ధిపొందాలంటే వివరాలు నమోదు చేసుకుని ఉండాలి. మరింత సమాచారానికి నేరుగా కార్మికశాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చు. – వినీత, అసిస్టెంట్ లేబర్ కమిషనర్

ఉద్యోగులు క్రీడాస్ఫూర్తిని చాటాలి



పోటీలు ప్రారంభిస్తున్న సంజయ్‌కుమార్ సూర్

జైపూర్(చెన్నూర్): ఉద్యోగులు క్రీడాస్ఫూర్తిని చాటాలని ఎస్టీపీపీ సీటీసీ సంజయ్‌కుమార్‌సూర్ అన్నారు. బుధవారం ప్రాజెక్టు ఆవరణలో ఎస్టీపీపీ క్రికెట్ లీగ్–2023 ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందన్నారు. పోటీల్లో ఎస్‌ఆర్పీ టీం, సింగరేణి టీంలు–3, పవర్‌మేక్ టీంలు–3, ప్రైవేట్ సెక్యూరిటీ, పీఈఎస్, ఏఆర్పీ టీం పాల్గొంటున్నాయి. మొదటిరోజు ఎస్టీపీపీ–1 టీం వర్సెస్ పవర్‌మేక్–3 టీంలు తలపడ్డాయి. ఈ కార్యక్రమంలో వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, జీఎం సూర్యనారాయణరాజు, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, డీజీఎం సివిల్ రవికుమార్, ఇతరశాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వేతనాల పెరుగుదల కార్మికుల విజయం



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

మందమర్రిరూరల్(చెన్నూర్): 11వ వేజ్‌బోర్డ్‌లో 19 శాతం వేతనాలు పెరగడం కార్మికుల విజయమేనని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. బుధవారం ఏరియాలోని వర్క్‌షాపులో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. వేతనాల పెంపు విషయంలో కేంద్ర ప్రభుత్వం, కోలిండియా యాజమాన్యం అనేక అవరోధాలు కల్పించినా జాతీయ కార్మిక సంఘాలు ఐక్యంగా ఉండడంవల్లే సాధ్యమైందన్నారు. గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసిందని, వెంటనే యాజమాన్యం ఎన్నికలు జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుదర్శన్, రామదాసు, శర్మ, లింగయ్య, మల్లయ్య, బానయ్య, భూమయ్య, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి సంక్రాంతి రద్దీ..!



మంచిర్యాల బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

మంచిర్యాలఅర్బన్: సంక్రాంతి నేపథ్యంలో తిరుగు ప్రయాణికులతో మంచిర్యాల బస్‌స్టేషన్‌లో రద్దీ నెలకొంది. పండుగకు హైదరాబాద్ నుంచి ఉద్యోగులు, విద్యార్థులు స్వగ్రామాలకు వచ్చారు. మూడు రోజుల అనంతరం తిరుగు ప్రయాణం కావడంతో బస్‌స్టేషన్ కళకళలాడుతోంది. మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు రోజువారీగా 38 బస్సులు నడిపేవారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ మరో 10 అదనపు బస్సులను ఏర్పాటు చేసింది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సోమవారం, మంగళవారం అదనపు బస్సులు నడిపారు. ప్రయాణికుల రద్దీని బట్టి హైదరాబాద్‌కు అదనపు బస్సులు నడిపిస్తామని మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ బుధవారం ‘సాక్షి’కి తెలిపారు.

రూ.76,05,337 ఆదాయం

సంక్రాంతి దృష్ట్యా ఆర్టీసీ ఈ నెల 7నుంచి 13వరకు మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్, భైంసా, ఆదిలాబాద్ డిపోల నుంచి 302 ప్రత్యేక బస్సులను నడిపించింది. 1,83,530 కిలోమీటర్ల మేర బస్సులు నడిపించడం ద్వారా ఆర్టీసీకి రూ.76,05,337 ఆదాయం సమకూరింది. తిరుగు ప్రయాణం నేపథ్యంలో ప్రత్యేక బస్సులతో మరింత ఆదాయం సమకూరే అవకాశం ఉందని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి తెలిపారు.

బస్సుల్లేక ఇబ్బందులు

ఖమ్మంలో బీఆర్ఎస్ సభ నేపథ్యంలో సోమవారం మంచిర్యాల డిపో నుంచి 35 బస్సులను తరలించారు. దీంతో బస్టాండులో బస్సుల్లేక ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

గడప గడపకూ వైఎస్సార్ పాలన

- వైఎస్సార్‌టీపీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అనిల్ కుమార్



మాట్లాడుతున్న వైఎస్సార్‌టీపీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్ కుమార్

ఆదిలాబాద్‌టౌన్: వైఎస్సార్ పాలనపై గడపగడపకూ వివరిస్తామని వైఎస్సార్‌టీపీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆ పార్టీ ముఖ్య నేతల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 10 నుంచి ప్రతి గ్రామంలో వైఎస్సార్ తెలంగాణ పార్టీ జెండా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బలోపేతం చేస్తామన్నారు. బూత్‌స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పూర్తిస్థాయి కమిటీలను వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాహుల్, మైనార్టీ విభాగం నాయకులు షేక్ మోయి న్, పట్టణ అధ్యక్షుడు షేక్ అస్లం, నాయకులు కృష్ణ మీనన్ యాదవ్, రాష్ట్ర గిరిజన విభాగం సభ్యుడు మెస్రం శంకర్, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

‘ప్రజలను దోచుకుంటున్న ప్రభుత్వాలు’

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ



మాట్లాడుతున్న కొక్కిరాల సురేఖ

మందమర్రిరూరల్(చెన్నూర్): తెలంగాణ ప్రజలు, వనరులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోచుకుంటున్నాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆరోపించారు. బుధవారం మందమర్రి మార్కెట్ ఏరియాలో ఏర్పాటు చేసిన చెన్నూర్ నియోజకవర్గ పాదయాత్ర ప్రారంభోత్సవానికి మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్ రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో లక్షల కోట్లు దండుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలోని సమస్యలు తెలుసుకునేందుకు నూకల రమేశ్ పాదయాత్ర చేపట్టాడని, అతన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉపేందర్, నాయకులు గోపతి రా జం, సత్యనారాయణ, రఘునాథ్‌రెడ్డి, ముజాయిద్, కాంపెల్లి సమ్మయ్య, తేజావత్ రాంబాబు, లక్ష్మణ్, జీవన్‌కుమార్, రాంచందర్, శ్రీనివాస్, రజిత, తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

తిర్యాణి: డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికుల వివరాల ప్రకారం... తిర్యాణి నుంచి మంచిర్యాలకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును త్రీఇన్‌క్లైయిన్ నుంచి తిర్యాణి వైపు వస్తున్న లారీ మెర్రిగూడ గ్రామ శివారులోని ఘాట్ సెక్షన్‌లోని మూలమలుపు వద్ద ఎదురుగా ఢీకొట్టింది. డ్రైవర్ బస్సును రోడ్డు కిందివైపునకు దించడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సులో 110 మంది ప్రయాణికులు ఉండగా ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదం తప్పించిన డ్రైవర్ తిరుపతిని ప్రయాణికులు అభినందించారు.

మగ్గంపై అమ్మవారి చీర..



మగ్గానికి పూజలు చేస్తున్న బాసర ఆలయ ఈవో విజయ రామారావు

నిర్మల్: బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో ఈనెల 26న నిర్వహించే వసంత పంచమి ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. వేడుకకు ముందుకు రోజు అమ్మవారికి అలంకరించే చీరను తొలిసారిగా బాసర ఆలయ ఆవరణలో భక్తులు మగ్గంపై నేస్తున్నారు. ఇందుకోసం ముందుగానే ఆలయ అధికారుల అనుమతి తీసుకున్న బాసర పద్మశాలి సంఘం సభ్యులు ఈనెల 25న అమ్మవారికి అలంకరించేందుకు 12 గజాల చీర నేతను బుధవారం ప్రారంభించారు. ఆలయ అతిథి గృహంలో ఈవో విజయరామారావు మగ్గానికి పూజలు చేసి ప్రారంభించారు. సరస్వతి అమ్మవారి పుట్టినిల్లుగా కొలిచే బాసలో అమ్మవారికి చీర నేయడం అదృష్టంగా భావిస్తున్నామని సంఘం సభ్యులు తెలిపారు.

ప్రియుని ఇంటి ఎదుట దీక్ష

భీమారం(చెన్నూర్): తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని మద్దికల్ గ్రామానికి చెందిన యువతి బుధవారం మండలంలోని సుంకరిపల్లి గ్రామానికి చెందిన జాడి అశోక్ ఇంటి ఎదుట దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా యువతి మాట్లాడుతూ కొంతకాలంగా తామిద్దరం ప్రేమించుకుంటున్నామన్నారు. విషయం తమ కుటుంబ సభ్యులకు తెలియడంతో ఇంట్లో నుంచి గెంటివేశారని వాపోయింది. దీంతో సదరు యువకుడు కూడా తప్పించుకు తిరుగుతుండడంతో దీక్ష చేపట్టినట్లు ఆమె పేర్కొంది. తనకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తానంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని యువతితో మాట్లాడారు. వారి సూచన మేరకు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సదరు యువకుడిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

‘ఆర్జీయూకేటీతో కలిసి పని చేయడానికి సిద్ధం’



జాయ్‌హాంగ్‌కిమ్, బృందంతో వెంకటరమణ

బాసర(ముధోల్): ఆర్జీయూకేటీ లాంటి ఉన్నత విద్యాసంస్థతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఇంటర్నేషనల్ మైండ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్, కొరియా ప్రెసిడెంట్ డాక్టర్ జాయ్‌హాంగ్ కిమ్ పేర్కొన్నారు. త్వరలో అవగాహన ఒప్పందం కుదుర్చుకుని తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఆర్జీయూకేటీ క్యాంపు కార్యాలయంలో మైండ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ కొరియా, హైదరాబాద్ శాఖ ప్రతినిధి బృందంతో బుధవారం బాసర ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కిమ్ మాట్లాడుతూ.. జూన్‌లో కొరియాలో జరిగే ఎడ్యుకేషన్ ఫెయిర్ సమావేశాలకు ఇన్‌చార్జి వీసీని ఆహ్వానించామని తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ.. మైండ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ కొరియా సంస్థలతో అవగాహన ఒప్పందంతో అకాడమిక్, విద్యాపరమైన సహాయ సహకారాలు అందిపుచ్చుకోవచ్చని పేర్కొన్నారు. ఇంటర్న్‌షిప్, అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడితో అద్భుత ఫలితాలు సాధిస్తామని తెలిపారు. ఈ సమాచారాన్ని ఇన్‌చార్జి వీసీ ఒక పత్రిక ప్రకటనలో వెల్లడించారు.

నాగోబా ఆలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారం



కమిటీ చైర్మన్, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఆలయ ఈవో రాజమౌళి

ఇంద్రవెల్లి(ఖానాపూర్): నాగోబా ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం నిర్వహించారు. చైర్మన్‌గా మెస్రం తుకారాం, సభ్యులుగా హనుమంత్‌రావ్, నాగోరావ్, పోల్లు, భీంరావ్, చైతన్యతో ఈవో రాజమౌళి ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నూతన కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావ్ సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో మెస్రం వంశీయులు బాదీరావ్, కోసేరావ్, వంశపెద్దలు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో ట్రస్ట్ సేవలు విస్తరిస్తాం



ప్రసంగిస్తున్న సద్గురు మధుసూదన్ సాయి

కాగజ్‌నగర్‌టౌన్(సిర్పూర్): గిరిజన ప్రాంతాల్లో ట్రస్ట్ సేవలను విస్తరించడంతో పాటు కాగజ్‌నగర్ పట్టణంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని కర్ణాటక (ముద్దెనహళ్ళి) నివాసి శ్రీ సత్య సాయి సుజల స్రవంతి ట్రస్ట్ వ్యవస్థాపకులు సద్గురు మధుసూదన్ సాయి అన్నారు. పట్టణంలోని పెట్రోల్‌పంప్ ప్రాంతంలో బుధవారం శ్రీ సత్యసాయి సుజల స్రవంతి ట్రస్ట్ వెల్‌నెస్ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వినయ్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రంలో ఉచితంగా గుండె, మాతా శిశు వైద్య పరీక్షలు, స్కానింగ్ సేవలు అందిస్తామన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో వైద్యసేవలు అందించాలనే సంకల్పంతో త్వరలోనే కాగజ్‌నగర్‌లో ట్రస్ట్ ఆధ్వర్యంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ వెల్‌నెస్ కేంద్రాన్ని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్పు చేస్తే స్థలం, ఇతర సదుపాయాలు, నిర్వహణకు తమవంతు చేయూత అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ తాలుకా బీజేపీ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, ట్రస్ట్ ప్రతినిధి ఆనంద్, సమన్వయకర్త భట్టు మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

కవ్వాల్‌లో శిక్షణ రేంజ్ అధికారుల పర్యటన



జన్నారం రేంజ్ పరిధిలో శిక్షణ రేంజ్ అధికారులు

జన్నారం: దూలపెల్లి ఫారెస్ట్ అకాడమీ నుంచి 47 మంది శిక్షణ రేంజ్ అధికారులు కవ్వాల్ టైగర్‌జోన్‌లో బుధవారం పర్యటించారు. మంగళవారం రాత్రి జన్నారం డివిజన్‌కు చేరుకున్న వారికి ఉదయాన్నే టీడీసీలో ఎఫ్‌డీవో మాధవరావు ఇక్కడి విషయాలను ప్రాజెక్టర్ ద్వారా చిత్రాలు చూపించి వివరించారు. అనంతరం జన్నారం అటవీ రేంజ్‌లోని గోండుగూడ బేస్‌క్యాంపు, గడ్డి క్షేత్రాలను పరిశీలించారు. నీటి కుంటలు, అడవుల రక్షణ తదితర అంశాలను ఎఫ్‌డీవో వారికి వివరించారు. కాలినడకన పలు ప్రదేశాలలో పర్యటించి అడవులను, వాటి రక్షణ, వన్యప్రాణుల రక్షణకు తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. అడవుల రక్షణకు తీసుకుంటున్న చర్యలను, వన్యప్రాణుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వారికి తెలియజేశారు. ఇందులో 42 మంది గుజరాత్ రాష్ట్రం, నలుగురు జమ్ము, ఒకరు లదక్ కు చెందిన శిక్షణ రేంజ్ అధికారులు ఉన్నారు. మరో రెండు రోజుల పాటు ఇక్కడే ఉండి టైగర్‌జోన్‌లోనే పర్యటించనున్నారు. వారి వెంట రేంజ్ అధికారి హఫీజోద్దీన్, సిబ్బంది ఉన్నారు.